

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

- రాజ్యాంగ నిర్మాతకు అవమానం
- భగ్గుమన్న ప్రజా సంఘాలు
- సంఘటనపై ఆరాతీస్తున్న పోలీసులు
- స్థల వివాదమే కారణమని ఆరోపించిన దళిత సంఘ నాయకులు

వార్త మెయిన్‌లో



అతలాకుతలం

- ఉప్పొంగిన వాగులు, వంకలు, చెరువులు, నదులు
- నిండిన చెరువులు, జలాశయాలు
- దెబ్బతిన్న పంటలు
- లబోదిబోమన్న అన్నదాతలు



సోమలలో దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న అధికారులు

ఫెంగల్ తుపాను ముంచెత్తింది. తీవ్ర నష్టాన్ని కలిగించింది. కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలులకు పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. పలుచోట్ల జనజీవనం స్తంభించింది. చెరువులు నిండాయి. సెలయేళ్లు పరవళ్లు తొక్కాయి. నదులు ఉధృతంగా ప్రవహించాయి. చిత్తూరు వద్ద ఎన్‌టీఆర్ జలాశయం, కార్వేటినగరం వద్దనున్న కృష్ణాపురం జలాశయం పూర్తిగా నిండడంతో అధికారులు గేట్లు ఎత్తివేశారు. రహదారుల్లో రాకపోకలు నిలిచిపోయాయి. మరి కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు కూలిపోయాయి. పలు గ్రామాల్లోని వీధుల్లో నీరు ప్రవహించాయి. పంటలు నీట మునిగాయి. చేతికందే వరిపైరు పూర్తిగా దెబ్బతింది. రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది.



విజయపురం: పన్నూరు ఆదిఆంధ్రవాడలో ఇంటిచుట్టూ చేరిన వర్షపునీరు

నిండు కుండలా బావి



నిండుగా తొనుకుతున్న బావి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: తుఫాన్ ప్రభావంతో మండలంలో కురుస్తున్న వానలకు చెరువులు, కుంటలు వ్యవసాయ బావులు నిండు కుండను తలపిస్తున్నాయి. ఈ సీజన్‌కి వరి పైరుకు డోకా లేదని రైతన్నలు చెబుతున్నారు. ఇక నుంచి వాన లేకుండా పోతే వరి మడులకు సన్నద్ధమవుతామని రైతన్నలు అంటున్నారు. సరైన సమయం ఇదేనని చెబుతున్నారు. ఇక నారుమడులతో పాటు, వరి నాట్లకు ఏర్పాట్లు చేసుకోనున్నట్లు అన్నదాతలంటున్నారు.


తుపాన్ తెచ్చిన తిప్పలు



కాళికాపురంలో నీట మునిగిన వరి

ప్రజాశక్తి-విజయపురం: ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలో వరద ఉధృతి సోమవారం కూడా తగ్గలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పన్నూరు ఆదిఆంధ్రవాడ లోతట్టు ప్రాంతంలో వరదనీరు ఇంటి చుట్టూ చేరడంతో ఇబ్బందులు పడ్డారు. మురికి కాలువలు లేక పోవడంతో ఎల్లసముద్రం ఎస్టీ కాలనీలో రోడ్డుపైనే వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. తెల్లగుంట, కాళికాపురం ప్రాంతాలలో వరదనీరు తగ్గక పోవడంతో పంటలు నీట మునిగి ఉన్నాయి. వరదరాజులు కండ్రిగ, గాండ్ల కండ్రిగ రోడ్లు దుస్థితికి చేరుకుందని, సిమెంటు రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండలంలోని చెరవులు నిండు కుండలా మారాయి.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



డాక్టర్ పుష్పకుమారి

ప్రజాశక్తి-సదుం: ఫెంగల్ తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. దోమలు భారీ నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సదుం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్పకుమారి అన్నారు. సోమవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. తుపాన్ ప్రభావం వల్ల చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు. ఉష్ణోగ్రతలు పడిపోవడం వలన అస్మా పేషెంట్లు ఇబ్బందులు పడే అవకాశం ఉందని, జ్వరాలు, వాంతులు, విరోచనాలు అయ్యే పరిస్థితులు నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రత పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటి తాగడం, ఆరోగ్య సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు.

దెబ్బతిన్న వరి



ప్రజాశక్తి-చౌడేపల్లి: ఫెంగల్ తుపాను ప్రభావంతో వరి పైరు పూర్తిగా దెబ్బతింది. మండలంలో ఇప్పటి వరకు 142 హెక్టార్లలో వరి దెబ్బతిన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ సందర్భంగా సోమవారం మండల వ్యవసాయ అధికారి జ్యోతమ్మ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో వరి చాలా వరకు దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. కోత దశలో ఉన్న పైరును తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఆ మేరకు రైతులు సూచనలు పాటించాలన్నారు. నష్టపరిహారం అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని స్పష్టం చేశారు.

నిండుగా కృష్ణాపురం జలాశయం



ప్రజాశక్తి-కార్వేటినగరం: మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కృష్ణాపురం జలాశయం పూర్తిగా నిండిపోయింది. నిండుకుండలా జలాశయం తొనుకుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి చేరుతున్న నీళ్లతో నీటి మట్టం పెరుగుతోందని, సోమవారం రాత్రి నీటిని వెలుపలకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ ఏఈలు భాస్కర్‌రాజు, రవిప్రకాష్ తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాల్లో పశువుల కాపరులు, రైతులు, విద్యార్థులు వాగును దాటేందుకు సాహసించ కూడదని తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే గ్రామాల్లో దండోరా వేయించడం జరిగిందని, జలాశయం వద్ద ప్రమాద హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో సందర్శకులు రావొద్దని అధికారులు చెప్పారు.

సోమలలో 200హెక్టార్లలో దెబ్బతిన్న వరి

ప్రజాశక్తి-సోమల: ఫెంగల్ తుపాను ప్రభావంతో మండలంలో 200హెక్టార్లలో వరి పైరు నష్టం కలిగిందని పుంగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమార్ అన్నారు. మండలంలోని తమ్మినాయునిపల్లి, కందూరు, పేగలవారిపల్లి, పొదలకుంటపల్లి, నెల్లిమంద పంచాయతీల పరిధిలోని గ్రామాలలో వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ ఆర్‌బికె సిబ్బంది పంట నష్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు ఆగేంత వరకు వరి కోతలు చేపట్టరాదని, ఇప్పటికే పంట కోసి నూర్పిడి చేసిన ధాన్యాన్ని భద్రంగా సురక్షితంగా కప్పి ఉంచాలన్నారు. పొలాలలో నిలిచిన వర్షపు నీటిని బయటకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటిలో మునిగి తడిసిన వరి పంటపై ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయడం వల్ల మొలకలు రాకుండా ఉంటాయని చెప్పారు. ప్రాథమిక అంచనాల ప్రకారం డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 500హెక్టార్ల వరి పైరు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు.



వరి పైరును పరిశీలిస్తున్న అధికారులు, సిబ్బంది

కరి బీభత్సం

- పంటలపై స్వైర విహారం
- అరటి, మామిడి, కొబ్బరి తోటల్లో అపార నష్టం



అరటి తోటను ధ్వంసం చేసిన ఏనుగులు

ప్రజాశక్తి-వి కోట: మండల పరిధిలోని బోయ చిన్నాగణపల్లె పరిసరాల్లో ఏనుగులు పంట పొలాలపై స్వైర విహారం చేసి రైతులకు అపార నష్టాన్ని కలిగించాయి. అటవీ సరిహద్దు నాయకనేరి అటవీ ప్రాంతంలోని బోయ చిన్నాగణపల్లి గ్రామ సమీపంలోని పంట పొలాల్లోకి ఏనుగుల గుంపు ప్రవేశించి పంట పొలాలను తీవ్రంగా నష్టపరిచాయి. అడవిని ఆనుకునే ఉన్న హనుమంత గౌడు, మురళి అనే రైతులకు చెందిన మామిడి చెట్లను విరిచేశాయి. అలాగే అరటి, కొబ్బరి చెట్లను సైతం తొక్కి తిని పడేసాయి. శేషాద్రి, కొండప్ప గౌడు అనే రైతులకు చెందిన స్వీట్ కార్న్, కాలీ ఫ్లవర్, బొప్పాయి పంటలను సైతం తొక్కి ధ్వంసం చేశాయి. అలాగే రాధాకృష్ణ గౌడు, నారాయణస్వామి అనే రైతులకు చెందిన మెడసిన్ దోస, అరటి చెట్లను సైతం నష్టపరిచాయి. ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు పంట పొలాల్లోనికి చొరబడి తోటలను తిని తొక్కి నష్టపరచడంతో రైతులు కన్నీటి పర్యంతమవు తున్నారు. గత మూడు నెలల కాలంగా ఏనుగుల బెడద లేదని ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటున్న అటవీ సరిహద్దు గ్రామాల రైతులకు కుప్పం రేంజ్ పరిధి నుంచి ఏనుగులమంద తిరిగి రావడంతో రైతులు కంటిమీద కునుకులేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల దాడుల్లో సుమారు రూ.2లక్షలకు పైగా పంట నష్టం సంభవించినట్లు బాధిత రైతులు తెలిపారు. అటవీ శాఖ అధికారులు ఏనుగులు పంట పొలాల్లోనికి రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పండ్ల పరిశ్రమలను ఆదుకోండి

కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పండ్ల పరిశ్రమలను ఆదుకోవాలని కోరుతూ సోమవారం పండ్ల పరశ్రమ సమాఖ్య నాయకులు సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలసి చర్చించారు. అనతరం వినతి పత్రం అందించారు. కలెక్టర్ స్పందించి వెంటనే సమస్యను సీఎం దృష్టికి తీసుకెళతామన్నారు. ఇక్కడ బ్యాంకర్స్‌తో మట్లాడి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఇన్ల్యాండ్ కంటైనర్ డిపో చెన్నై, హైదరాబాదులోని ఐసిడి యజమానులతో మామిడి గుజ్జు ఎగుమతిపై చర్చించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ హరీష్, ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, చిత్తూరు జిల్లా పండ్ల పరిశ్రమ కార్యదర్శి కట్టమంచి బాబి, సభ్యులు తలపలపల్లి బాబు రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, సమీర్ శర్మ, సోమశేఖర్ పాల్గొన్నారు.

అపరిశుభ్రతకు నిలయంగా..

- రోడ్లపైనే ప్రవహిస్తున్న మురుగునీరు
- జ్వరాల బారిన పడుతున్న జనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- రోడ్డుపై నిరసన తెలిపిన పెద్దపంజాణీ వాసులు



పెద్దపంజాణీ ప్రధాన వీధిలో నిలిచిన మురుగు నీరు



నిరసన తెలియజేస్తున్న పెద్దపంజాణీ వాసులు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మండల స్థాయి అధికారులు తరచూ చెబుతున్నా ఆచరణలో కనిపించడం లేదు. గ్రామాల్లో పర్యవేక్షిస్తున్నామని ఫోటోలు తీసి ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు కానీ పలుచోట్ల పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. పట్టించుకున్న పాపాన పోలేదని పెద్దపంజాని ప్రజలు మండిపడుతున్నారు. సోమవారం సాయంత్రం పలమనేరు మదనపల్లి జాతీయ రహదారిలో బైఠాయించి ధర్నా చేశారు. సాక్షాత్తు ప్రభుత్వ శాఖ అధికారులు ఉండే మండల కేంద్రమైన పెద్దపంజాణిలోని పారిశుధ్య పరిస్థితులు దయనీయంగా మారాయంటే మిగతా పంచాయతీ గ్రామాల్లో పరిస్థితులు ఊహించుకోవచ్చు. మండల కేంద్రమైన పంజాణి సత్రంలో మసీదు వీధి ప్రాంతంలో మురుగునీటి కాలవ నిండిపోయి చెత్తాచెదరంతో పెరిగిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్న ఇక్కడ పారిశుధ్య పనులు పట్టించుకునే నాధుడే కరువయ్యారు. పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారడంతో పాటు మరుగునీరు నిల్వ ఉండడంతో పురుగులు ఏర్పడి దోమల సంచారం పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నట్లు చెబుతున్నారు. మండల కార్యాలయానికి కేవలం అర కిలోమీటర్ల దూరంలోనే ఈ ప్రాంతం ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లమవుతుందని వాపోతున్నారు. ఈ విషయంగా అధికారులకు ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించి ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఫసల్ బీమా యోజన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ ఆధారిత పంటల బీమా పథకం: రబీ 2024-25 పోస్టర్‌లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక శాఖల అధికారులు మురళీకష్ణ, మధుసూదన్ రెడ్డి, డాక్టర్ ప్రభాకర్, ఎల్‌డిఎం హరీష్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తుపానులు, కరువు, అకాల వర్షాల వంటి ప్రకతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా ఆర్థిక సహాయం అందుతుందన్నారు.

అవగాహన కల్పించండి: జెసీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రైతులకు ఆర్థిక సహాయం అందించేలా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాలపై క్షేత్ర స్థాయిలో విస్తత అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులను జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తూ.. పథకంపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు.


మద్యం వద్దు.. నాణ్యమైన విద్య ముద్దు..

- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలి
- ముగిసిన సీపీఎం జిల్లా మహాసభలు
- జిల్లా కన్వీనర్‌గా వందవాసి నాగరాజు



ఎన్నికైన నూతన జిల్లా కార్యవర్గం, నూతన కార్యదర్శి వందవాసి నాగరాజు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి/సత్యవేడు: రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన మద్యం అవసరం లేదు.. నాణ్యమైన విద్య కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి సూచించారు. వెనుకబడ్డ రాయలసీమ జిల్లాలకు నిధులు కేటాయించి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సత్యవేడులో జరుగుతున్న 14వ సీపీఎం జిల్లా మహాసభలు సోమవారంతో ముగిశాయి. ముగింపు సభలకు ముఖ్యఅతిథిగా డి.రమాదేవి హాజరయ్యారు. అదాని సోలార్ విద్యుత్ కుంభకోణంపై దేశ వ్యాప్తచర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఈ భారం అందరిపైనా పడుతుందని తెలిపారు. విద్య ప్రయివేటీకరణలో భాగంగా జగన్ బ్రిటన్‌తో జగన్ చేసుకున్న 'సాల్ట్' ఒప్పందాన్ని కొనసాగించకుండా చంద్రబాబు రద్దు చేయాలన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరిట రాష్ట్ర ప్రజల నుంచి పన్నులు వసూళ్లు చేసి అదానీ, అంబానీకి ధారాదత్తం చేసేలా కూటమి సర్కారు పనితీరు ఉందని మండిపడ్డారు. ఇప్పటికే జాతీయ రహదారుల్లో టోల్ ఫీజుల ద్వారా రూ.22వేలు కోట్లు దోచిపెట్టిన బాబు ప్రభుత్వం జిల్లా రహదారుల ద్వారా కూడా ప్రజల టోల్ తీసేందుకు సన్నాహాలు చేస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన మద్యం ఇస్తామంటున్న చంద్రబాబు నాణ్యమైన విద్యనెందుకు ఇవ్వలేకున్నారని ప్రశ్నించారు. ఆధ్యాత్మిక నగరి తిరుపతిని వాటికన్ సిటీగా తీర్చిదిద్దుతామన్న పాలకులు వెంకన్న చెంత మద్యపుటేర్లు పారిస్తున్నారని ధ్వజమెత్తారు. గుడులు, బడుల వద్ద మద్యం దుకాణాలు వద్దంటూ స్థానిక ప్రజానీకం తిరగబడుతోందని గుర్తు చేశారు. అనంతరం తిరుపతి జిల్లా సమగ్రాభివృద్ధికి అవసరమైన 28 అంశాలతో కూడిన తీర్మాణాలను మహాసభల ద్వారా ఆమోదించారు. తిరుపతి జిల్లాలోని వెంకటగిరి, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందించడమే లక్ష్యంతో ప్రారంభించిన సోమశిల- స్వర్ణముఖి ప్రాజెక్టు పనులు అటవీ అనుమతులు, నిధుల లేమి, పరిహార వివాదాల కారణంగా గత పదేళ్లుగా నత్తను తలపిస్తున్నాయి. కాలువ పనులు పూర్తయితే వెంకటగిరి, రాపూరు, డక్కిలి, శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లోని లక్షల ఎకరాలకు సాగునీరు, 150 గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. పాలక ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నిందలు మోపుకోవడం తప్పా సాధించిందేమీ లేదనీ, వెంటనే ప్రాజెక్టు పనులు పూర్తి చేసి లక్ష్యం నీరుగారకుండా చూడాలన్నారు. మన్నవరం బెల్ పరిశ్రమను పునరుద్ధరించాలని కోరారు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆస్తి పన్ను పెంపును రద్దుచేయాలన్నారు. దశలవారీ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలను నిలువరించాలని డిమాండ్ చేశారు. అధిక ధరలతో నియంత్రణతోపాటు, కార్మికుల వేతనాలను రూ.26వేలకు పెంచాలని కోరారు. పులికాట్ సరస్సును అభివృద్ధి పరచి, మత్స్యకారులకు బాసటగా నిలవాలని చెప్పారు. చేనేత, పవర్ ల్యూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం 15 మంది సభ్యులతో కూడిన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు రమేష్, గంధం మణి, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

జిల్లా కార్యదర్శిగా 'వందవాసి నాగరాజు'

తిరుపతి జిల్లా సీపీఎం కార్యదర్శిగా వందవాసి నాగరాజు ఎన్నికయ్యారు. సత్యవేడులో సోమవారం జరిగిన సీపీఎం 14వ మహాసభల సందర్భంగా ఆయన్ను రెండో పర్యాయం జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం గమనార్హం. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కందారపు మురళీ, అంగేరి పుల్లయ్య, టి.సుబ్రమణ్యం, దాసరి జనార్దన్, కమిటీ సభ్యులుగా సాయిలక్ష్మి, జయచంద్ర, మాధవ్, ఆర్.వెంకటేష్, హరినాథ్, వేణుగోపాల్, బి.రవి, ఆర్.లక్ష్మి, జోగి రవికుమార్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్యలు వ్యవహరించారు. నూతన కమిటీ నూతనోత్సాహంతో పార్టీ బలోపేతానికీ, ప్రజా పోరాటాలకు సిద్ధమవుతుందని జిల్లా కన్వీనర్ వందవాసి నాగరాజు అన్నారు.

అలరించిన డప్పు ప్రదర్శనలు



జిల్లా మహాసభల సందర్భంగా ప్రజానాట్య మండలి, జానపద వృత్తి కళాకారులు చేపట్టిన ప్రదర్శనలు అలరించాయి. డప్పుల దరువులతో, ఉద్యమపాటలతో పాలక ప్రభుత్వాల వైఫల్యాన్ని ఎండగట్టారు.

రేపు దుకాణాల లీజు వేలం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని మొగిలి గ్రామంలో శ్రీ కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన వివిధ దుకాణాలకు ఈనెల 4న బుధవారం లీజు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మునిరాజు, వంశ పారంపర్య ధర్మకర్త విజయకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం 11గంటలకు దేవదాయశాఖ అధికారుల సమక్షంలో వాహనాల పార్కింగ్, కొబ్బరి కాయలు, పూజాసామగ్రి విక్రయం, పాదరక్షలు భద్రపరచుట, కొబ్బరి చిప్పల సేకరించుకునే హక్కు, తలనీలాల సేకరణ హక్కుకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తలనీలాల సేకరణకు సంబంధించి రూ.50వేలు, మిగిలిన వాటికి సంబంధించి రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు ఆలయ కార్యాలయంలో సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

చెస్ ఛాంపియన్ షిప్‌నకు సుసిత్ర



క్రీడాకారిణిని అభినందిస్తున్న సాగర్‌రాజు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలకు కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపిక అయినట్టు కళాశాల వైస్ చైర్మన్ సాగర్ రాజ్ తెలిపారు. ఇటీవల తిరుపతి ఎస్వీయూలో జరిగిన ఇంటర్ కాలేజ్ చెస్ పోటీలకు తమ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న సుసిత్ర పాల్గొన్నట్టు తెలిపారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన ఆమె ఎస్వీయూ తరఫున సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించారు.

సీఎం, మంత్రిని కలిసిన నేతలు



సీఎంను కలిసిన నాయకులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ను టీడీపీ కుప్పం నేతలు కలిశారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పించాలని సీఎం, మంత్రికి విన్నవించినట్లు నాయకులు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో నాయకులు చెక్కునత్తం మణి, సతేంద్ర శేఖర్, డాక్టర్ వెంకటేష్, మురళి, సుబ్బు, బాలు, మంజు, గిరిధర్ ఉన్నారు.

శ్రీనివాసులు రెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

ప్రజాశక్తి-గంగవరం: పలమనేరు మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు, గంగవరం మండల టీడీపీ మాజీ అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి మృతి పట్ల ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి తన సంతాపాన్ని తెలిపారు. సీనియర్ నాయకులైన శ్రీనివాసులు రెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. దీంతో విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మండల టిడిపి నాయకులతో కలిసి మృతుని స్వగ్రామం కీలపల్లి గ్రామానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబీకులను ఓదార్చి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తపరిచారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు ఉన్నారు.

అపరిచితులతో జాగ్రత్త: ఏఎస్ఐ



అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ వల్లెమ్మ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అపరచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని ఏఎస్ఐ వల్లెమ్మ అన్నారు. మండల కేంద్రంలోని బాలికల వసతి గృహంలో సోమవారం బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో పోలీస్ కంట్రోల్ నెంబర్ 112కు ఫోన్ చేయాలని సూచించారు. వసతి గృహంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ గీత తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు వితరణ



నిత్యావసరాలు అందిస్తున్న ట్రస్టు సభ్యులు

ప్రజాశక్తి-విజయపురం(నగరి): మున్సిపల్ పరిధి టీఆర్ కండ్రిగలోని శిరిడ్స్ దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు ప్రేరణశ్రీ ఎడ్యుకేషనల్, ఛారిటబుల్ ట్రస్టు వారు నిత్యావసర సరకులు, దుప్పట్లను వితరణగా అందించారు. సోమవారం పాఠశాలకు వెళ్లి ట్రస్టు ఫౌండర్ మోహన లక్ష్మి, ప్రొఫెసర్ డాక్టర్ ఇ ప్రభాకర్ రెడ్డి విద్యార్థులకు సరకులను, దుప్పట్లను అందించారు. విద్యార్థులకు పౌష్ఠికాహారం అందించాలని, వర్షాకాలం కావున విద్యార్థులు చలికి ఇబ్బంది పడకుండా అందరికీ దుప్పట్లు కేటాయించాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల నిర్వాహకులు ట్రస్టు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అర్థవంతమైన సమాధానం ఉండాలి: కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల వద్ద నుంచి అందుతున్న ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం, పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలతో 101అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశాలిచ్చారు. వెనువెంటనే పరిష్కారం చూపాలని దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ శాఖ 87, పోలీస్ శాఖ 6, ఆర్‌డబ్ల్యూఎస్ 1, డిఆర్‌డిఎ 5, సాంఘిక సంక్షేమ శాఖ 1, సర్వశిక్ష అభియాన్ 1 చొప్పున అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జెసీ విద్యాధరి, డీఆర్‌వో మోహన్‌కుమార్, ఆర్‌డీవో శ్రీనివాసులు వినతులు స్వీకరించారు.

ఫిర్యాదులపై అలసత్వం వద్దు: ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పి మణికంఠ చందోలు ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఎస్‌పి, అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజుని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. "ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే మా లక్ష్యం" అని ఎస్‌పి అన్నారు. ఈ ఫిర్యాదులపై తక్షణ చర్య తీసుకొని ప్రజలు న్యాయం పొందేలా చూడాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

వినతులు సకాలంలో పరిష్కరించాలి: కమిషనర్



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన వినతులను సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నగర ప్రజలు వివిధ సమస్యలపై కమిషనర్‌కు వినతి పత్రాలు అందించారు. పలు సమస్యలపై కమిషనర్ అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడానికి చర్యలు చేపట్టారు. గతవారం అందిన అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. కార్యక్రమంలో టీపీవో-1, పింఛన్లు-2 చొప్పున మొత్తం మూడు వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.



అస్తవ్యస్తంగా ఉన్న పేదల ఆవాసాలు



పుంగనూరు టిడ్కో ఇళ్ల సముదాయం

సమస్యల వలయంలో టిడ్కో ఇళ్లు

- అస్తవ్యస్తంగా పేదల ఆవాసాలు
- ఇళ్లలోకి వస్తున్న మురుగునీరు
- ఎక్కడి చెత్త అక్కడే..
- దుర్గంధభరితంగా నివాస సముదాయం
- కనీస అవసరాలు కరువు
- మౌలిక సదుపాయాలూ అంతంతమాత్రమే
- పట్టించుకోని అధికారులు


ప్రజాశక్తి-పుంగనూరు: ఇండ్లు లేని నిరుపేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతమైన లక్ష్యంతో టిడ్కో ఇండ్లను పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో నిర్మించింది. వాటి నిర్వహణ మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదు. 24 ఎకరాలలో 300 చదరపు అడుగుల విస్తీర్ణంతో 1536 ఇండ్లు నిర్మించారు. ఒక్క బ్లాక్‌కు 32ఇండ్లు లెక్కన 48బ్లాకులు నిర్మించారు. ఇండ్లు నన్నింటినీ లబ్ధిదారులకు కేటాయించారు. సింగల్ బెడ్ రూమ్ ఇండ్లే మొత్తం. వీటి అన్నింటిలోనూ సుమారు 300మంది మాత్రమే ఇండ్లలో నివాసం ఉన్నారు. మురుగినీటి కాలువలు, రోడ్లు, తాగునీటి బోర్లు, భూగర్భ డ్రైనేజీ వంటి వసతులు కల్పించిన వాటి నిర్వహణ పైన మాత్రం శ్రద్ధ పెట్టడం లేదు. బ్లాకుల మధ్య పారిశుద్ధ్య లోపం స్పష్టంగా కనిపిస్తుంది. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు దీంతో డ్రైనేజీ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా మారింది. వీధి దీపాలు సక్రమంగా వెలగకకపోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం, సెప్టిక్ ట్యాంకులు పొంగిపొర్లడం, ఇండ్లలోకి మురుగునీరు చేరడం వంటి సమస్యలతో టిడ్కో ఇండ్లలో ఉన్న ప్రజలు సతమతమవుతున్నారు. ఇండ్లలో నుంచి వెలువడే చెత్త ఎక్కడపడితే అక్కడ కుప్పలుగా ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు అభివృద్ధి చెందితో పిల్లలు, పెద్దలకు విష జ్వరాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా వీరు పట్టణానికి రావాలంటే నాలుగు కిలోమీటర్ల దూరం రావలసి ఉంటుంది. చౌక దుకాణంలో వస్తువులు తీసుకోవాలన్నా, గ్యాస్ సిలిండర్లు తీసుకువెళ్లాలన్నా ఆటో బాడుకులకు ఎక్కువ ఖర్చవుతుంది అని అక్కడ నివాసితులు వాపోతున్నారు. టిడ్కో ఇండ్ల సమస్యలు తీర్చాలని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కూడా చేపట్టారు. పట్టణానికి ఒకసారి ఆటోలో వెళ్లి రావాలంటే సుమారు 400రూపాయలు ఖర్చు అవుతుందని నివాసితులు చెప్తున్నారు. తాగునీరు కూడా బ్లాకులకు ఓ పద్ధతి ప్రకారం సరఫరా చేయాల్సి ఉండగా ఒకేసారి అందరికీ వదలడంతో సక్రమంగా నీరు వారికి చేరడం లేదని ఆరోపిస్తున్నారు. 1536ఇండ్లలోను లబ్ధిదారులు అందరూ ఉండేలాగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలో ఇండ్లు ఉన్న వారికి కూడా టిడ్కో ఇళ్లలో అలాట్మెంట్ చేశారని అందువలన అక్కడ కాపురం లేకుండా ఇండ్లకు తాళాలు వేసుకొని పట్టణంలో కాపురం ఉన్నారు. అర్హులైన పేదలందరూ నివాసం ఉండేలాగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జీవాల కాపరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

- వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా జీవాలను కాపాడాలి
- పశు వైద్యాధికారిణి చందన ప్రియ



వైద్యం చేస్తున్న డాక్టర్ చందన ప్రియ





ప్రజాశక్తి-సోమల: ఎడతెరిపి లేని వర్షాల కారణంగా ఆరు బయట తిరిగే మేకలు, గొర్రెలు, పచ్చి గడ్డి తింటూ చెరువులు మురికి కాలువలలో నీటిని తాగుతూ తొలకరి జల్లులకు తడుస్తుంటాయి. దీని వల్ల పలు రకాల వ్యాధులకు గురవుతాయి.. వర్షాకాలంలో ఎక్కువగా చిటుక రోగం, గాలికుంటు, నీలి నాలుక పిపిఆర్ వంటి రోగాలు వచ్చి చనిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది.. వీటి నుంచి జీవాలను రక్షించడానికి వాటి యజమానులు పలు రకాల జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యాధికారిని చందన ప్రియ కోరారు. సోమవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ గొర్రెలకు ఆహారం మంచిగా ఉన్నా కూడా వ్యాధులు సోకే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారని, ఈ చినుకులకు మొలచిన గడ్డిని తింటే చిటుకు వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. టీకాలను క్రమం తప్పకుండా గొర్రెలకు వేయించడం ద్వారా ఈ వ్యాధి నుండి గొర్రెలను కాపాడుకోవచ్చునన్నారు. వర్షాకాలంలో చిత్తడి నేలలలో ఎక్కువసేపు తిరగడం వలన బ్యాక్టీరియా కారణంగా కాలి పుండు వ్యాధి సోకుతుందని వ్యాధి సోకిన గొర్రెలు కుంటుతూ నడుస్తాయని కావున వీటిని బురద నేలలలో తిరగనివ్వకుండా జాగ్రత్త పడాలని కోరారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఈగలు దోమలు వృద్ధి చెంది వీటి బెడద ఎక్కువగా ఉంటాయని క్యూలైకోయిడ్స్ అనే దోమ కాటు వలన ఆరోగ్యంగా ఉన్న గొర్రెలలో కూడా ఆర్బో వైరస్ సంక్రమించి నీలి నాలుక వ్యాధికి గురవుతాయని ఈ వైరస్ వలన రక్తనాళాలను నాశనం చేస్తాయన్నారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా టీకాలు వేయించడం వలన వ్యాధిని నివారించి అధిక దిగుబడిని పొందవచ్చు పేర్కొన్నారు. వ్యాధులు సోకిన గొర్రెలు మేతను మేయలేవని చెడిపోయిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఈ వ్యాధి సోకే అవకాశం ఉందని గొర్రెలకు మేతను మేపేటప్పుడు మంచి ఆహారం అందించాలని వ్యాధి సోకిన గొర్రెలను మంద నుండి వేరు చేయాలన్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే పశు వైద్య సిబ్బందిని వైద్యాధికా రులను కలిసి చికిత్స అందించాలని ఆమె కోరారు.

ఘనంగా ఎయిడ్స్ దినోత్సవం



ప్రజాశక్తి-విజయపురం(నగరి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని ఎయిడ్స్ వ్యాధి అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు వ్యాధి అవగాహనను పెంపొందించే వివిధ అవగాహన ప్రదారాలు, కార్యకలాపాలను నిర్వహించి, మహమ్మారి స్థితి గురించి అవగాహన పెంచడం, ప్రపంచవ్యాప్తంగా నివారణ, చికిత్స, సంరక్షణలో పురోగతిని ప్రోత్సహించడంపై దృష్టి సారించాలి అని తెలిపారు. కార్యక్రమంలో ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ ఇందిర ప్రియదర్శిని, ఎన్‌సిసి కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ రాజు, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పూల తోటలలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

- సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని



ప్రజాశక్తి-సదుం: పూల తోటలను సాగు చేసే క్రమంలో యాజమాన్య పద్ధతులను పాటించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని అన్నారు. సోమవారం మండల వ్యవసాయ అధికారి హరి ప్రసాద్ ఆధ్వర్యంలో చింతపర్తివారిపల్లి పంచాయతీ పరిధిలోని బలిజపల్లిలో రైతులు సాగు చేస్తున్న పూల తోటలను సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, శాస్త్రవేత్త, డాక్టర్ సంధ్యారాణి బలిజపల్లిలోని పూల తోటలను పరిశీలించారు. పూతదశలో పూల మొక్కలు ఎండిపోతున్నాయని రైతులు వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో కంభంవారిపల్లి ఉద్యాన సహాయకురాలు ప్రమీల, రైతులు పాల్గొన్నారు.

కాలనీల సమస్యలు పరిష్కరించండి

కమిషనర్‌కు టీడీపీ నేతల వినతి



కమిషనర్‌తో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-విజయపురం(నగరి): తుపాను ప్రభావంతో పలు గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులున్నాయని, పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని వెంటనే తదుపరి చర్యలు చేపట్టాలని నగరి కమిషనర్‌ను టీడీపీ నాయకులు కోరారు. సోమవారం కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి పలు విషయాలను చర్చించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగిరి మున్సిపల్ పరిధి గల కొన్ని ప్రదేశాలు రాజీవ్ నగర్, నగిరి పేట, అమిత్ నగర్, వినాయక నగర్, సాయి నగర్, ఓం శక్తి ఎస్టి నగర్, నగిరి దళితవాడ, ఆనంద కాలనీ, కిలపట్టు బీసీ కాలనీ, ఏకాంబర కుప్పం, ప్రకాష్ నగర, కెవిఆర్ పేట, సత్రవాడ వినాయక నగర్, కీలపట్టు దళితవాడ, పుదుపేట, నత్తం కండిగ తదితర ప్రదేశాల్లో వర్షపు నీరు నిండి దోమలకు నిలయమైందన్నారు. కొంతమంది డెంగీ, జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారు. కొన్ని చోట్ల తాగునీటి మోటర్ రిపేర్ అవ్వడంతో తాగునీరు పంపిణీ ఇబ్బందికరంగా ఉందని పట్టణ కమిషనర్‌కు, డిఈ , ఏఈలకు, సానిటరీ ఇన్స్పెక్టర్ తెలియజేశారు. కమిషనర్ అధికారులతో సమావేశమై ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని అధికారులను తక్షణ చర్యలపై ఆదేశించారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ నాయకులు, యువత పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మద్యం మత్తులో బావిలో పడి వ్యక్తి మృతి



విజేంద్ర మృతదేహం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మద్యం మత్తులో కాలుజారి బావిలో పడి విజేంద్ర(43) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం గంగవరం మండలం కల్లుపల్లిలో వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపంజాణి మండలం పొట్టగానిపల్లికి చెందిన విజేంద్ర నవంబర్ 30వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయలుదేరి కల్లుపల్లి సమీపంలో ఓ పాడుబడ్డ బావి వద్ద మద్యం సేవించి చీకటి పడగానే మద్యం మత్తులో ఇంటికి వెళ్లాలని ఆత్రుతలో పక్కనే ఉన్న బావిలో పడిపోయాడు. ఆదివారం కుటుంబీకులు విజేంద్ర ఇంటికి రాలేదని బంధువులు, స్నేహితులకు ఫోన్లో ద్వారా సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో కల్లపల్లి సమీపంలో భావి ప్రక్కన విజేంద్ర ద్విచక్ర వాహనం, టవల్ గుర్తించిన స్థానికులు పొట్టగానిపల్లె గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో గ్రామస్తులు, కుటుంబీకులు హుటాహుటిన అక్కడికి చేరుకుని బావిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఫలితం లేకపోవడంతో పలమనేరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారాన్ని అందించారు. అగ్నిమాపక సిబ్బంది కూడా బావిలో గాలింపు చర్యలు చేపట్టగా బావిలో ఎక్కువగా ముళ్ళ తీగలు ఉండడంతో పాతాళభేరి వేయడానికి వీలులేక ఫలితం లేకపోయింది. అప్పటికే చీకటి పడటంతో అందరూ వెనుతిరిగారు. సోమవారం బావిలో విజేంద్ర మృతదేహం తేలియాడుతున్న దృశ్యాన్ని గుర్తించిన కొందరు గంగవరం పోలీసులకు సమాచారం అందించి విజేంద్ర మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు. మద్యం మత్తులో బావిలో పడి విజేంద్ర మృతి చెందడంతో పొట్టగాని పల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య



విజయభాస్కర్ మృతదేహం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చెరువులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చిత్తూరు నగరంలోని గంగినేని చెరువులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అందరూ చూస్తుండగా ఓ వ్యక్తి అమాంతంగా గంగినేని చెరువులో దూకాడు ఈ విషయాన్ని గమనించిన పార్కులోని వారు అతడిని కాపాడే ప్రయత్నం చేస్తుండగా పూర్తిగా మునిగిపోవడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది దాదాపు అరగంటలకు పైగా శ్రమించి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడు స్థానిక రాఘవేంద్ర కాలనీకి చెందిన విజయభాస్కర్‌గా(38) గుర్తించారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటు సారా స్వాధీనం



ఊటను పారబోస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: అక్రమంగా నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. 197రామాపురానికి చెందిన సోమశేఖర్‌ను సోమవారం అరెస్టు చేసి 19నాటు సారా ప్యాకెట్లు స్వాదీనం చేసుకున్నట్లు చెప్పారు. సోమశేఖర్ సమాచారం మేరకు అమర్నాథ్ అజ్జి బాబు అను అతని పొలం వద్ద 5డ్రమ్ములలో బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఎక్సైజ్ సిబ్బంది సుబ్రహ్మణ్యం, దేవ ప్రసాద్, ఢిల్లీ బాబు, రాజేష్, దీప, కష్ణవేణి పాల్గొన్నారు.

రెండు రోజుల్లో కారుణ్య నియామకాలు

- జడ్పీ సీఈవో రవికుమార్ వెల్లడి



జెడ్పి సీఈవోతో చర్చిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో అకాల మరణం చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు రెండు రోజుల్లో కారుణ్య నియామకాల ప్రక్రియ ద్వారా ఉద్యోగ అవకాశం కల్పిస్తామని జెడ్పీ సీఈవో రవికుమార్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎస్టీయూ చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఆర్థిక కార్యదర్శి మదన్ మోహన్ రెడ్డి, బోడే మోహన్ యాదవ్, యువరాజు ఆధ్వర్యంలో జెడ్పీ సీఈవోను కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్ మాట్లాడుతూ, కారుణ్య నియామకాల్లో జాప్యం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయిన ఉపాధ్యాయ కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్య నిధి ఖాతాల క్రమబద్ధీకరణను వేగవంతం చేయాలని, రుణాలు మంజూరులో జాప్యం నివారించాలని కోరారు. ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమచంద్రా రెడ్డి మాట్లాడుతూ, పిఎఫ్ మిస్సింగ్ క్రెడిట్స్ వివరాలు సేకరణకు ప్రత్యేక షెడ్యూల్ ప్రకటించాలని కోరారు. అనంతరం జెడ్పీ సీఈవో రవికుమార్ మాట్లాడుతూ రెండు రోజుల్లోనే కారుణ్య నియామకాల ప్రక్రియ చేపడుతామని హామీ ఇచ్చారు. జూనియర్ అసిస్టెంట్ సహా అర్హత గల మిగిలిన పోస్టులను కూడా నిబంధనల మేరకు భర్తీ చేస్తామని తెలిపారు. భవిష్యనిధి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో సత్వర చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు సర్దార్, చిట్టిబాబు, గుణశేఖర్, లక్ష్మీపతి, గణపతి, మధు, ఉమాపతి, ఢిల్లీ బాబు, అమర్ తదితరులు పాల్గొన్నారు.